క్లుప్తంగా

వైభవంగా ఏడు శనివారాల వ్రతం



వ్రతంలో పాల్గొని పూజలు చేస్తున్న మహిళలు

తాడిపత్రి అర్బన్: లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఏడు శనివారాల వ్రతాన్ని మూడవ వారమైన శనివారం పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయంలో వైభవంగా ఆచరించారు. ప్రధాన అర్చకుడు మురళీబట్టార్ నేతృత్వంలో మహిళలు సామూహిక వ్రతమాచరించారు. ఈసందర్భంగా ఆలయంలోని ప్రధాన ఆది దేవతలైన లక్ష్మీ సహిత చింతల వెంకటరమణస్వామికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనాథలకు అన్నదానం

గుత్తి: పట్టణంలోని కొత్తూరు అనాథాశ్రమంలో అనాథలకు శనివారం గుత్తి పట్టణ బలిజ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు కందుల హేమలత అన్నదానం చేశారు. ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆశ్రమానికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, అంగన్‌వాడీ టీచర్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం



మాట్లాడుతున్న ఉప సంచాలకుడు డాక్టర్ సుధాకర్

తాడిపత్రి రూరల్: మండలంలోని యర్రగుంటపల్లిలో శనివారం పాడి పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లింగ నిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ గురించి రైతులకు పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ సుధాకర్ వివరించారు. పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యం అందించాలన్నారు. పశు వైద్యాధికారి హరిక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గాలేమ్మ జాతర

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో ఆదివారం గాలేమ్మ జాతర నిర్వహించనున్నారు. శనివారం గ్రామస్తులు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గాలేమ్మ జాతర నిర్వహించడం అనవాయితీ అన్నారు. ప్రజలు, సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఏటా జాతర నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే జాతరకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.


23 నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

పుట్లూరు: మండలంలో ఈ నెల 23 నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆధార్ సేవలను అందించనున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ నిర్వహించే ఈ ఆధార్ కేంద్రాలకు ప్రజలు, విద్యార్థులు హాజరైయ్యేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. 23న ఆదర్శ పాఠశాల, 24న కేజీబీవీ, 25న జెడ్పీ ఉన్నత పాఠశాల, 26, 27 తేదీల్లో గ్రామ సచివాలయంలో ఈ మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆధార్ అప్డేట్, ఇతర ఆధార్ సంబంధిత సేవలను అందించనున్నట్లు ఆయన వివరించారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి ఆర్ఎస్ వైపు వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో ఆటో కూడా పాక్షికంగా దెబ్బతినింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో గాలేమ్మ జాతర సందర్భంగా శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఓపెన్ టోర్నమెంట్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 30 జట్లు పాల్గొన్నాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కబడ్డీ పోటీలను తిలకించారు. విజేత జట్లకు నిర్వాహకులు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలు అందజేశారు.

పంట పొలాలకు జింకల బెడద

- వేరుశనగ సాగుకు రైతుల వెనుకంజ
- అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు



పొలాల్లో జింకల సంచారం

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ప్రాంతంలో వేలాదిగా ఉన్న కృష్ణ జింకల బెడదతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. జింకలు పంటలను నాశనం చేస్తుండడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టిన పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరవుతోంది. ఖరీఫ్ సీజన్‌లో గతంలో తాడిపత్రి ప్రాంతంలో ఎక్కువగా వేరుశనగ పంటను పండించేవారు. వేరుశనగ పంట మొలకలను తినడం, తొక్కడంతో పంటకు నష్టం జరిగేది. ఏడాదికేడాది జింకల సంతతి పెరగడం, వాటిని నియంత్రించే వనరులు లేకపోవడంతో వేరుశనగ పంట సాగు చేయడమే మానుకున్నారు. ప్రస్తుతం కొర్ర, పత్తి, మినుములు, మొక్కజొన్న తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. వాటిపై కూడా జింకలు పడి నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మందలుగా దాడి

తాడిపత్రి ప్రాంతంలోని పలు గ్రామాల్లోని పంట పొలాలపై జింకలు మందలు, మందలుగా పడుతున్నాయి. తాడిపత్రి మండలంలోని కొండేపల్లి, చల్లవారిపల్లి, గన్నెవారిపల్లి, తిప్పారెడ్డిపల్లి, జంజులపాడు, కొనగుంటపల్లి, దిగువపల్లి, ఎగువపల్లి, తలారి చెరువు, ఊరుచింతల, పుట్లూరు మండలంలోని గాండ్లపాడు, తక్కళ్లపల్లి, శనిగలగూడూరు, తిమ్మాపురం, గాండ్లపాడు, పుట్లూరు, గోపరాజుపల్లి, యాడికి మండలంలోని కోన ఉప్పలపాడు, రాయలచెరువు, గుడిపాడు, చందన పెద్దవడూగూరు మండలంలోని పెద్దవడుగూరు, చిన్న వడుగూరు, విరుపాపురం, అవులాంపల్లి, వెంకటాంపల్లి, మిడుతూరు, కాశేపల్లి తదితర గ్రామాల్లో జింకలు ఎక్కువగా దాడి చేస్తున్నాయి. కొండ ప్రాంతాలు, గుట్టలు, విస్తారంగా ఉండే బయలు ప్రాంతాలను ఆవాసాలుగా ఏర్పరుచుకుంటున్నాయి. ఆయా ప్రాంతాల్లో సాగు చేసిన పత్తి, వేరుశనగ, కొర్ర, కంది తదితర పంటలపై జింకలు దాడి చేస్తున్నాయి. జిల్లాలో అత్యధికంగా పెద్దవడుగూరు మండలంలో వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్న పత్తి పంటపై జింకల బెడద ఎక్కువగా ఉంటోంది. పంటలను రక్షించుకునేందుకు రైతులు పొలాల వద్ద కాపాలాగా ఉంటున్నారు. గతంలో యల్లనూరు మండలంలో వేలాది ఉన్నా జింకల వల్ల పంటలకు జరుగుతున్న నష్టంపై గుత్తి ఫారెస్టు రేంజర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఫారెస్టు అధికారులు చేసిన పలు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోతోంది.

పత్తి సాగు చేశా



పత్తి పంటపై జింకల బెడద ఎక్కువగా ఉంది. ఎకరన్నర పొలంలో పత్తిని సాగు చేశాను. పంటను కాపాడుకునేందుకు కాపలా వెళుతున్నాను. ప్రస్తుతం పత్తి పంట ఆశాజనకంగా ఉంది. అయితే జింకలు వచ్చి నాశనం చేస్తాయోన్న భయం వెంటాడుతోంది.

– సోముల నాయుడు, పెద్దవడుగూరు

కాపలా ఉంటున్నా



చందన పరిసర ప్రాంతాల్లో జింకలు ఎక్కువగా ఉంటున్నాయి. వేసిన పంటలను తినడం, కాళ్లతో తొక్కి నాశనం చేస్తున్నాయి. మూడు ఎకరాల్లో మొక్క జొన్నను జింకల నుంచి రక్షించుకోవడానికి పలు రకాల ప్రయత్నాలు చేస్తున్నాను. పంటకు కాపలాగా వెళుతున్నాను

– చంద్ర, చందన, యాడికి మండలం

పొలానికి కంచె వేసుకున్నా



ఏడు ఎకరాల్లో మొక్క జొన్న పంటను సాగు చేశా. జింకల నుంచి పంటలను రక్షించుకోవడానికి పొలం చుట్టూ కంచె వేశా. జింకల పట్ల ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పంటను సర్వనాశనం చేస్తాయి.అధికారులు స్పందించి జింకల బెడద నుంచి పంట పొలాలను కాపాడాలి.

– నాగరాజు, గన్నెవారిపల్లి, తాడిపత్రి మండలం

చర్యలు తీసుకుంటున్నాం



జింకల మందల నుంచి పంటలను రక్షించాలని రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. జింకలను నియంత్రించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోతోంది. పంట నష్టం జరిగిన రైతులు ఫిర్యాదు చేస్తే వ్యవసాధికారులతో కలిసి పరిశీలించి పరిహారం కోసం ప్రభుత్వానికి వివరాలు పంపుతాం.

– మధుబాబు, గుత్తి ఫారెస్టు రేంజ్ అధికారి

పెట్టుబడులు తగ్గించుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బుక్కరాయసముద్రం: రైతులు పంటల సాగులో పెట్టుబడులు తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖ, నూనె గింజల అభివృద్ధి విభాగం అసిస్టెంట్ డైరెక్టర్లు అవినాష్, శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఓబులాపురం గ్రామ సమీపంలో వేరుశనగ పొలాలను వారు పరిశీలించారు. మండలంలో ఎంత మంది రైతులు ఉన్నారు, ఎన్ని ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు, విత్తు నుంచి పంట కోత సమయం వరకు ఎకరాలో ఎంత పెట్టుబడి వస్తోంది అనే వివరాలను తెలుసుకున్నారు. ఖరీఫ్, రబీ సీజన్ల వారీగా పంటల వివరాలపై అధికారులతో నివేదికలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందజేయాలన్నారు. సూక్ష్మ పోషకాల ఎరువులు రాయితీతో ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, అనంతపురం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవి, వేరుశనగ పరిశోధనా కేంద్రం అజయ్, మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

యాడికి/పామిడి: డెంగీపై అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శనివారం ఆయన చందన ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి డెంగీ వ్యతిరేక మహోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. హెచ్ఎం పవన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పామిడి మండలంలోని పీ కొండాపురం, దేవరపల్లి, గజరాంపల్లి, వకరాజుకాలువ తదితర గ్రామాల్లో ఈఓఆర్డీ శశికళ ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్యం మెరుగు పనులు చేపట్టారు. ఆయా గ్రామాల్లో వాటర్ క్లోరినేషన్‌తో పాటు అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, మునీంద్ర, దేవేంద్ర, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

ఐరావత వాహనంపై రుక్మిణీ పాండురంగస్వామి



ఐరావత వాహనంపై రుక్మిణీ పాండురంగస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలో డబ్బేదార్ ఫిర్కా, రంగసుబే ఫిర్కా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుక్మిణీ పాండురంగ స్వామి ఆషాఢ మాస బ్రహ్మోత్సవాలు శనివారంతో ఐదోరోజుకు చేరాయి. ఈసందర్భంగా స్థానిక పెద్ద, చిన్న విఠోబ దేవాలయాల్లో రుక్మిణీ పాండురంగ స్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దిండి భజనల నడుమ రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలను ఐరావత వాహన సేవలో ఉంచి నగర ప్రదర్శన గావించారు. అలాగే స్థానిక చిన్న విఠోబ దేవాలయంలో రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలకు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ జే వెంకటేశ్వరరావు, ఎల్వీ హరి దంపతుల సారథ్యంలో పెళ్లి తంతు చేశారు. ఈసందర్భంగా డబ్బేదార్ ఫిర్కా, రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో వేర్వేరుగా కుల సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయా ఫిర్కాల ఆధ్వర్యంలో భావసార క్షత్రియ ప్రతిభావంత విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. ఆయా ఫిర్కాల కమిటీ సభ్యులు జవళకర్ శ్రీనివాసరావు, ఖమిత్కర్ శ్రీనివాసరావు, జవళకర్ రవీంద్రనాథ్‌రావు, గోందెశే రాజశేఖర్‌రావు, టీటీ నాగభూషణ్‌రావు, యూ మంజునాథ్‌రావు, ఎల్ఎస్ నారాయణరావు, రమేష్‌రావు, వెంకటేశ్వరరావు, ఎల్వీ హరి, ఏట క్రిష్ణయ్య, నారాయణమూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న వెటర్నరీ డాక్టర్ కమల

పెద్దవడుగూరు: గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని జెడ్పీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల్లో పశువులకు వచ్చే వ్యాధుల గురించి వెటర్నరీ డాక్టర్ కమల వివరించారు. బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపాలని ఎంఈఓ రాముడు సూచించారు. తెలికి, మేడిమాకులపల్లి గ్రామాల్లోని రోగులు క్రిష్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే చాలా దూరమని, పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుసంధానం చేయాలని ఎంపీటీసీ రాముడు కోరారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా సర్పంచులు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఏడీజే శ్రీహరి

గుత్తి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గుత్తి మండల న్యాయ సేవా సమితి చైర్మన్, ఏడీజే శ్రీహరి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏడీజే కోర్టులో శనివారం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో హెల్మెట్ ధరింపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీజే మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాల నుంచి బయటపడవచ్చన్నారు. హెల్మెట్‌తో పాటు లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ కూడా ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనం డ్రైవ్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మనోహర్ బాబు, ఫక్రుబాషా, కుమార్, శ్రీనివాసులు, రాంగోపాల్, సోమశేఖర్, శివ కుమార్ ఆచారి, కె.శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు



బుక్కరాయసముద్రంలోని షిర్డీ సాయిబాబా విగ్రహం

బుక్కరాయసముద్రం: చెరువు కట్టపై షిర్డీ సాయినాథ్ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఆదివారం ఉదయం 6 గంటలకు కాగడ హారతి, 7.30కి అఖండ భజన పంచస్నాన పూజ, మధ్యాహ్నం 12 గంటలకు మధాహ్న హారతి, సాయంత్రం 4.30 గంటలకు గంటలకు దూప్ హారతి, అనంతరం సాయిబాబా విగ్రహాన్ని ఊరేగించనున్నారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

పామిడి: పట్టణంలోని దత్త మహాయోగ పీఠంలో ఆదివారం నిర్వహించే గురుపౌర్ణమి వేడుకలను జయప్రదం చేయాలని ఆ దత్త పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ శనివారం తెలిపారు. ఉదయం 8 గంటలకు వ్యాసపూజ, గురుపూజ నిర్వహిస్తామన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే



మర్తాడులో కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా శనివారం కుష్టు వ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య మాట్లాడుతూ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఆశావర్కర్లు ఇంటింటికీ తిరిగి ఆగస్టు 2 వరకూ సర్వే చేసి, అవగాహన కల్పిస్తారన్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, ముఖం, చెవులు, వీపు మీద నొప్పి లేని బుడిపెలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు రావడం వంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలన్నారు. కుష్టు వ్యాధికి ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా చికిత్స చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జయంతి, శివమ్మ, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు జయలక్ష్మి, కల్పన, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతులందజేస్తున్న స్కూల్ డైరెక్టర్

గుంతకల్లుటౌన్: స్థానిక మాంటిస్సోరి స్కూల్‌లో శనివారం నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో 203 మంది చిన్నారులు పాల్గొనగా పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. పోటీలను ఎమ్మెల్యే జయరామ్ సోదరుడు నారాయణస్వామి ప్రారంభించారు. బాలుర విభాగంలో సహృద్, రామారావు, క్రిష్ణ సుధీంద్ర మొదటి మూడుస్థానాల్లో, బాలికల విభాగంలో శ్రీహా, సుకృత, హారికచౌదరి మొదటి మూడుస్థానాల్లో నిలిచినట్లు స్కూల్ డైరెక్టర్లు నాగార్జున, ప్రభాకర్ తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రపంచ చదరంగ సమాఖ్య 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డు కోసం 50 దేశాల్లో 640 చెస్ టోర్నమెంట్లను నిర్వహించినట్లు నాగార్జున తెలియజేశారు.

సజావుగా మండల మీట్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పామిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన మండలమీట్ నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ సభ్యురాలు ఎల్.శోభారాణి, డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి, సీఐ ఎం.రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖాపరమైన అభివృద్ధి పనులపై ఆయా శాఖాధికారులతో సమీక్షించారు. ప్రధానంగా భూ సమస్యలు పరిష్కరించాలంటూ ఎంపీపీతోపాటు సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి అధికారులను కోరారు. పంచాయతీల్లో మౌలిక వసతులను కల్పించి, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పలువురు సభ్యులు కోరారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీలు మజ్జిగ రాజశేఖర్, సువర్ణ, రామలక్ష్మి, సర్పంచ్‌లు వెంకటేష్‌నాయక్, రామాంజనేయులు, రంగమ్మ, మహేశ్వరి, ఈఓఆర్డీ బీవీ శశికళ, ఏఈ డీ లీనా వసుంధర, ఏఈ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ



గుంతకల్లు మండలం కసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



శింగనమల ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొక్క నాటుతున్న వైస్ ఎంపీపీ విజయ



గార్లదిన్నె మండలం కనంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎంఈఓ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

గుంతకల్లు రూరల్: మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, అటవీశాఖ అధికారి మధుబాబు సూచించారు. గుంతకల్లు మండలంలోని కసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అటవీశాఖ ఆధ్వర్యంలో తల్లిపేరు మీద ఒక చెట్టు అనే కార్యక్రమం పేరుతో వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో దాదాపు 500 మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ క్రిష్ణమూర్తి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కరీముల్లా, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజేశ్వరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల: హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో విరివిగా మొక్కల పెంపకం చేపడదామని వైస్ ఎంపీపీ విజయ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ బీవీ రమణతో కలసి ఆమె మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీదేవి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ అక్బర్ వలి, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఎంఈఓ చంద్రనాయక్ సూచించారు.శనివారం కనంపల్లి పాఠశాల ఆవరణలో హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమం కింద అధికారులు మొక్కలు నాటారు. అనంతరం వారు మధ్యాహ్న భోజనం పథకం పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: చెట్లు ప్రగతికి మెట్లు అని ఎంపీపీ భోగాతి మురళీ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ శ్రీనివాసరావు సారథ్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన హరిత వనమహోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఆయన ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీలు మజ్జిగ రాజశేఖర్, రామలక్ష్మి, సువర్ణ, సర్పంచ్‌లు రంగమ్మ, మహేశ్వరి, పార్వతి, ఈఓఆర్డీ బీవీ శశికళ, సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: హరిత అనంత కార్యక్రమంలో భాగంగా మండలంలోని యర్రగుంటపల్లి పాఠశాల ఆవరణలో శనివారం ఎంపీడీఓ నరసింహరావు, అధికారులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పామిడి ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అధికారులు



తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ తదితరులు

ఘనంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: గురుపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా శివాలయం వీధిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం చండీ హోమం, రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు కాశీ, రామేశ్వరం తదితర పుణ్య నదీ తీర్థాలతో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవ చేశారు. అలాగే ఆదివారం నిర్వహించనున్న గురుపూర్ణిమ వేడుకలను పురస్కరించుకుని శివాలయం వీధి, సంజీవనగర్‌లోని సాయిబాబా ఆలయాల్లో పెద్దఎత్తున ఏర్పాట్లను చేశారు. సుమారు 50 వేల మంది భక్తులకు భోజన వసతి ఏర్పాట్లు చేశారు.